సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

గరిష్ఠం / కనిష్ఠం
30° / 25°

వాతావరణం
జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

ఉండ్రాలయ్య వస్తున్నాడు



వినాయక చవితి నవరాత్రి వేడుకలకు జిల్లావ్యాప్తంగా భక్తులు సిద్ధమయ్యారు. పల్లెలు, పట్టణాల్లో మండపాలు సిద్ధం చేశారు. వివిధ రూపాల్లో ఉన్న వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మార్కెట్లలో గణపయ్య పూజలకు గరక, మారేడు కాయలు, తెల్ల కాయలు, బిల్వ పత్రాలు తదితర పూజా సామగ్రిని జోరుగా విక్రయిస్తున్నారు.

- 10, 11 లో

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, కల్యాణ వేడుక కరోనా కాలాన్ని తలపించింది. కల్యాణానికి ఒకే ఒక్క జంట హాజరై వేడుకను తిలకించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో గత వారంరోజులుగా భారీ వర్షలతో వరదలు రావడంతో రామాలయానికి భక్తుల తాకిడి భారీగా తగ్గింది. దీంతో ఆలయ పరిసరాలు సైతం నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్



రేగళ్ల పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్

కొత్తగూడెంరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వస్తున్న విషజ్వరాలు, సీజనల్‌వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియాల అంటూ జ్వర బాధితుల నుంచి ఆర్‌ఎంపీలు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిమితికి మించి వైద్య సేవలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఎంపీల తీరుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్‌సెంటర్లలో జ్వరాలు, సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల డాక్టర్ స్వప్న తదితరులు ఉన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 9న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి తెలిపారు. డేటా సైన్స్‌లో 25, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 20, లైఫ్ సైన్సెస్‌లో ఐదు, బీకాం వివిధ కేటగిరీల్లో ఆరు, బీఏలో మూడు సీట్లు ఖాళీ ఉన్నాయని వెల్లడించారు. ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు ఈనెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. వివరాలకు 94910 63083, 96409 47467 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విస్తరణకు బ్రేక్!



కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

లచ్చన్న దళం ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు ఎదురుదెబ్బ

- పార్టీ విస్తరణకు కరకగూడెం కేంద్రంగా ప్రణాళికలు
- గతంలోనూ మావోయిస్టుల షెల్టర్ జోన్‌గా ఉన్నవైనం
- 90వ దశకంలో 26 మంది పోలీసులను హతమార్చిన మావోలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీలోకి తెలంగాణ నుంచి రిక్రూట్‌మెంట్లు బాగా తగ్గిపోయాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కేడర్ చేత తెలంగాణలో చొచ్చుకు వచ్చేందుకు ఎర్రదండు శ్రమిస్తోంది. అయితే స్థానిక పరిస్థితులు, వేషభాషలు తదితర అంశాల్లో ఉన్న తేడాలు వారికి సులువుగా ఇక్కడ పట్టు చిక్కనివ్వడం లేదు. మరోవైపు పోలీసు నిర్బంధం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో చోటుచేసుకున్న కరకగూడెం ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు విస్తరణ ప్రణాళికకు భారీ బ్రేక్ వేసినట్టయింది.

ఒకప్పుడు పెట్టని కోట..

కరకగూడెం మండలంతోపాటు ఇక్కడ విస్తరించిన దట్టమైన అడవులు ఇప్పటి మావోయిస్టులు ఒకప్పటి నక్సలైట్లు/కమ్యూనిస్టులకు పెట్టని కోటలా పని చేసేవి. దీంతో సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొనే కమ్యూనిస్టు విప్లవకారులును గోదావరి తీర ప్రాంతంలో నిలువరించడానికి 1940వ దశకంలోనే కరకగూడెంలో పోలీస్ అవుట్‌పోస్ట్ ప్రారంభమైంది. మావోయిస్టు ప్రాబల్యం పెరిగిన తర్వాత 1992 సెప్టెంబర్ 4న రాళ్లవాగు దగ్గర మావోయిస్టులు పేల్చిన మందుపాతర ధాటికి పది మంది పోలీసులు తునాతునకలయ్యారు. ఆ తర్వాత 1997 జనవరి 10న ఏకంగా పోలీస్ స్టేషన్‌పైనే నక్సల్స్ మెరుపుదాడి చేశారు. ఈ ఘటనలో 16 మంది పోలీసులు చనిపోయారు. ఈ దాడి అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా కరకగూడెం వచ్చి దాడికి గురైన పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఆ తర్వాత యాంటీ నక్సల్స్ ఆపరేషన్లలో పోలీసులు కొత్త పంథాను మొదలెట్టారు.

మరోసారి షెల్టర్‌జోన్‌గా మార్చుకునేందుకు వ్యూహం

కరకగూడెంలో మొదలయ్యే అడవులు, కొండలు అవిచ్ఛిన్నంగా ములుగు, భూపాలపల్లి జిల్లాల వరకు విస్తరించి ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాన్ని మరోసారి షెల్టర్ జోన్‌గా మార్చుకునేలా మావోలు వ్యూహాలు రచించారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు తిరిగి ఇక్కడ దళాలను ఏర్పాటు చేసే దశకు చేరుకున్నారు. గడిచిన రెండేళ్లలో భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు (బీకే–ఏఎస్‌ఆర్) డివిజన్ కమిటీ నాయకత్వంలో చర్ల–శబరి, మణుగూరు – పాల్వంచ, ఇల్లెందు – నర్సంపేట, సింగరేణి ఏరియా కమిటీల పేరుతో లేఖలు జారీ చేయడం, వాల్ పోస్టర్లు, బ్యానర్లు అంటించడం వంటి చర్యల ద్వారా ఉనికి చాటుకునే ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. దీంతోపాటు కొత్త రిక్రూట్‌మెంట్‌పైనా ఫోకస్ పెట్టారు. కరకగూడెం – గుండాల – తాడ్వాయి అడవులు, గుట్టలే ఆలంబనగా మావోలు ఈ పనులు చేస్తూ వచ్చారు.

నిర్బంధం పెంచిన పోలీసులు

తెలంగాణలో మావోయిస్టులు తిరిగి పాగా వేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను నిర్వీర్యం చేసేందుకు పోలీసు శాఖ నిర్బంధం మరింతగా పెంచింది. మావోయిస్టుల కదలికపై కన్నేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది జూలై 25న గుండాల మండలం దామెరతోగు దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. తాజాగా కరకగూడెం మండలంలో చోటుచేసుకున్న రెండో ఎన్‌కౌంటర్‌లో బీకే–ఏఎస్‌ఆర్ డివిజన్‌లో భాగంగా ఉన్న మణుగూరు–పాల్వంచ ఏరియా కమిటీకి చెందిన లచ్చన్న దళం అంతరించిపోయినట్టు భావిస్తున్నారు. మరోవైపు ఇక్కడ సంచరిస్తున్నట్టుగా చెబుతున్న భద్రు దళం కూడా ఆత్మరక్షణలో పడినట్లయింది. దీంతో ఉత్తర తెలంగాణ గ్రామీణ, ఏజెన్సీ ఏరియాల్లో మావోయిస్టుల మలి విస్తరణ ప్రణాళికకు ఎదురుదెబ్బ పడినట్టయింది.

ముమ్మరంగా గాలింపు!

కరకగూడెం: ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న మావోయిస్టు మాసయ్య కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. వలస ఆదివాసీ గ్రామాల్లో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని, కొత్తవారు ఎవరైనా గ్రామాల్లోకి వస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు వారికి సూచించినట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల సరిహద్దు గుండాల మండల దామరతోగు అటవీ ప్రాంతంలో, తాజాగా కరకగూడెం మండలంలో ఎన్‌కౌంటర్లు జరగడంతో ఏజెన్సీ ప్రాంతంలో అలజడి నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన పట్టు..

ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న కరకగూడెం మండలంలో 2004 తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. పోలీసు నిర్బంధం పెరగడంతో గ్రామాల్లోకి దళాలు రావడం తగ్గిపోయింది. మరో పదేళ్లు గడిచే సరికి సాధారణ ప్రజానీకంతో మావోయిస్టులకు మధ్య సంబంధాలు బాగా తగ్గిపోయాయి. కేవలం కొరియర్లు, సానుభూతిపరులే మిగిలారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో మావోయిస్టుల నేతృత్వంలో జనతన సర్కార్ ఏర్పాటైంది. ఈ జనతన సర్కార్‌పై కేంద్రం కన్నెర్ర చేయడంతో మరోసారి తెలంగాణలో పట్టు కోసం మావోలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో సరిహద్దు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి అడుగు వేశారు.

కానిస్టేబుళ్లకు అడిషనల్ డీజీపీ పరామర్శ



ఎస్పీ రోహిత్‌రాజుతో మాట్లాడుతున్న గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ స్టీఫెన్ రవీంద్ర

భద్రాచలంఅర్బన్: కరకగూడెం అటవీ ప్రాంతంలో గురువారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు వంశీ, సందీప్‌లు గాయపడ్డారు. వీరిని భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిని రాష్ట్ర గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ స్టీఫెన్ రవీంద్ర శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. అవసరమైతే హైదరాబాద్ తరలించాలని సూచించగా, మరో రెండు, మూడు రోజుల పాటు ఇక్కడే వైద్యం అందించాలని వైద్యులు చెప్పినట్టు భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ తెలిపారని సమాచారం. అడిషనల్ డీజీపీని ఎస్పీ రోహిత్‌రాజు కలిశారు. బూర్గంపాడు మండలం సారపాకలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్, భద్రాచలం సీఐ సంజీవరావు స్వాగతం పలికారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ప్రణాళికాబద్ధంగా చదివించి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ బీఈడీ విద్యార్థులకు సూచించారు. భద్రాచలం బీఈడీ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. లైబ్రరీ, ల్యాబ్‌లను పరిశీలించి మాట్లాడారు. లైబ్రరీలో విద్యార్థులకు కాంపిటేటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు కళాశాలలో టెట్, టీఆర్టీ కోచింగ్ తప్పనిసరిగా తీసుకుని, డీఎస్సీకి ప్రిపేర్ కావాలన్నారు. టెట్, డీఎస్సీ మెటీరియల్ సహకారం అందిస్తామన్నారు. అనంతరం డీఎడ్ కళాశాలను సందర్శించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. డార్మెటరీ బ్లాకు పరిశీలించి మరమ్మతులు ఉంటే పూర్తిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ తానాజీ, డీఈ హరీష్, ఏఈ శ్రీనివాస్, కళాశాలల ప్రిన్సిపాల్స్ వీరూ నాయక్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి జర్నలిస్టుల కృషి ఎనలేనిది

భద్రాచలంఅర్బన్: సమాజ అభివృద్ధికి జర్నలిస్టుల కృషి ఎనలేనిదని భద్రాచల ఐటీడీఏ పీఓ రాహుల్ పేర్కొన్నారు. భద్రాచలం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జర్నలిస్ట్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షకార్యదర్శులు బీవీ రమణారెడ్డి, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాల కళాశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఐటీడీఏ పీఓలు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ, డీటీడీఓలు, గురుకుల ఆర్‌సీఓ, ఏటీడీఓలు, ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎం, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్‌తో కలిసి మంత్రి సీతక్క సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వరదలు రాకముందే ముందు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు. మణుగూరులోని పీఎంహెచ్ హాస్టల్‌లోకి వరద వస్తే విద్యార్థులను సురక్షితంగా వేరే పాఠశాలకు తరలించామని తెలిపారు. డీడీ మణెమ్మ గురుకులం ఆర్సీఓ నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

పులుసుబొంత ప్రాజెక్ట్‌కు త్వరలో ఆమోదం



అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్

కరకగూడెం: మండల పరిధిలోని నర్సాపురంపాడ్ గ్రామ సమీపంలో పెద్దవాగుపై నిర్మించతలపెట్టిన పులుసు బొంత ప్రాజెక్ట్ స్టేజ్–1కు త్వరలో ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తుందని డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లాలోని దుమ్ముగూడెం, జూలూరుపాడు, అడవి రామారంలోని భూములు పరిశీలించామని చెప్పారు. ప్రాజెక్ట్ కాలువల ప్రణాళిక, ప్రాజెక్ట్ మ్యాపును పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం రేంజర్ పి.ఉపేందర్, అనంతారం ఎఫ్‌ఎస్‌ఓ గోవింద్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సింగరయ్య పాల్గొన్నారు.

అధికారిక సమీక్షలో కాంగ్రెస్ నాయకులు..



వ్యవసాయాధికారులతో సమీక్షిస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదినారాయణ శుక్రవారం ఏఓ పీశివరాం ప్రసాద్, ఏఈఓలు షాకీరా భాను, నార్లపాటి రవీంద్ర, సతీష్‌తో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొందరు పాల్గొనడం, ఎమ్మెల్యేకు ఓ పక్క నాయకుడు కూర్చోవడంతో అధికారులు ఇబ్బంది పడినట్లు సమాచారం. ఇప్పటికే గుమ్మడవల్లి ప్రాజెక్టు, పెదవాగు ముంపులో నష్టపోయిన వారి జాబితా తయారీలో పార్టీ నాయకుల జోక్యంపై విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గంలో కొన్నిచోట్ల కాంగ్రెస్ నేతల తీరు చర్చనీయాంశంగా మారుతోంది.

కొనసాగుతున్న గాలింపు చర్యలు



గాలింపు చేపడుతున్న డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది



భార్య మమత, కూతురితో సాయికృష్ణ

పాల్వంచరూరల్: మూడు రోజుల క్రితం కిన్నెరసాని వాగులో గల్లంతైన జారే సాయికృష్ణ ఆచూకీ ఇంకా దొరకలేదు. డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది పడవసాయంతో గాలించినా ఫలితంలేదు. తామే వెతుక్కుంటామని వ్యక్తి బంధువులు వాగులో దిగే ప్రయత్నం చేయగా పోలీసులు వారించారు. సాయికృష్ణ బుధవారం చేపల కోసం వెళ్లి మండల పరిధిలోని దంతెలబోరు గ్రామం వద్ద కిన్నెరసాని వరద ప్రవాహంలో గల్లంతయ్యాడు. అతని కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు, అధికారులు మూడురోజులుగా గాలిస్తున్నారు. శుక్రవారం కూడా రూరల్ పోలీసులు డీడీఆర్‌ఎఫ్ బృందాన్ని పిలిపించి బోటుసాయంతో వాగులో రెస్క్యూ చేశారు. అయిన ఆచూకీ దొరకపోవడంతో గాలింపును నిలిపివేశారు. అదే సమయంలో వాగు వద్దకు వచ్చిన సాయి బంధువులు, కుటుంబ సభ్యులు తాము కూడా వెతుకుతామని వాగులో దిగే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.

చేపలు తెస్తానని వెళ్లాడు...

ఆ రోజు నా భర్త చేపలు తెస్తానని తోడల్లుడు భద్రంతో కలిసి మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. కానీ ఇంకా రాలేదు. అతను తిరిగి వస్తాడని ఇద్దరు కూతుళ్లతో ఎదురుచూస్తున్నా.

–మమత, సాయికృష్ణ భార్య

మట్టి గణపతులకు ప్రాధాన్యమివ్వాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ జితేష్ పాటిల్

చుంచుపల్లి: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను వినియోగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా కాలుష్య నియంత్రణ మండలి విగ్రహాలను ఉచితంగా అందజేయటం అభినందనీయమన్నారు. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.రసాయనాలతో కూడిన విగ్రహాలను పూజించడం వల్ల జల కాలుష్యం పెరిగిపోతోందని అన్నారు. పర్యావరణాన్ని పర్యవేక్షించేందుకు వినాయక చవితి వేడుకల్లో ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.రవీందర్, సిబ్బంది అరుణాదేవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంట నష్టం సర్వే



పంట నష్టం సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ తాతారావు

బూర్గంపాడు: అకాల వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నివేదికలను సిద్ధం చేస్తున్నారని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బి.తాతారావు అన్నారు. మండల పరిధిలో జరుగుతున్న పంటనష్టం సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పూర్తిగా దెబ్బతిన్న పంటలను కూడా నష్ట నివేదికలలో చేర్చుతున్నామని, పాక్షికంగా దెబ్బతిన్న పంటలను నష్ట నివేదికలలో చేర్చటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శంకర్, ఏఈఓలు ప్రసాద్, శృతి, పవన్ పాల్గొన్నారు.

ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలి

కొత్తగూడెంఅర్బన్/చుంచుపల్లి: తక్కువ భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను మహిళా రైతులు సాగు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పాడి గేదెలు, చేపల పెంపకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన ఆక్వా మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్, కొరమేను చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళా రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మిల్క్ యూనిట్లు, పెరటి కోళ్ల పెంపకం, చేపల పెంపకం, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధిలోకి రావాలని అన్నారు. మునగ, అజోల్లా, వెదురు, ఆక్వాసిస్టం, తేనె, బాతుల పెంపకం వంటివి చేపడితే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. జిల్లాలో రైతులను ప్రోత్సహించేందుకు సరికొత్త విధానాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. మహిళా రైతులు కూడా వ్యవసాయ సాగులో సరికొత్త ఆలోచన చేయాలని చెప్పారు. పంటలకు విపరీతమైన పెట్టుబడులు పెట్టి నష్టపోయే బదులు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌రెడ్డి, నాబార్డు, వ్యవసాయశాఖ, ఆర్టికల్చర్ అధికారులు, సెర్ప్ డీపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

బౌద్ధ ధ్యాన మందిరాల అభివృద్ధి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండలో ఉన్న బౌద్ధ ధ్యాన మందిరాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ గుట్టలపై ఉన్న బౌద్ధ ధ్యాన మందిరాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ధ్యాన మందిరాలు, గృహాలు ఎంతో ఆకర్షణగా ఉన్నాయని, వీటిని పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కారుకొండ గుట్ట పరిసరాల చుట్టూ రక్షణ కల్పించి సోలార్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీఓ శ్రీనివాస రావు, బుద్ధిస్ట్ సొసైటీ బాధ్యులు ఎ. నాగేశ్వరరావు, కె.కమలారాణి, ఎం. రమేష్, మాజీ సర్పంచ్ బల రాంనాయక్, సింగరేణి డీవైజీఎం బీభత్స, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

క్రీడాకారుడికి అభినందన

కొత్తగూడెం టౌన్/భద్రాచలంటౌన్: అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ పవర్ లిఫ్టింగ్ గిరిజన క్రీడాకారుడు మోడెం వంశీని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం అభినందించారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వంశీ బంగారు పతకం సాధించాడు. అక్టోబర్ 4 నుంచి సౌత్ ఆఫ్రికాలో జరిగే కామన్వెల్త్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు కూడా ఎంపికయ్యాడు. క్రీడాకారుడిని పీఓ రాహుల్ కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ పరంధామ రెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, మహంతి వెంకటకృష్ణ జీవీ మల్లేష్, కాశీ హుస్సేన్, కోచ్ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉండ్రాలయ్య వస్తున్నాడు..

- నేటి నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు
- వాడవాడలా ముస్తాబైన మండపాలు
- తొమ్మిది రోజులపాటు అంగరంగా వైభవంగా పూజలు
- భక్తులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కొత్తగూడెంటౌన్: విఘ్నాలను తొలగించే అధినాయకుడు.. వినాయకుడు శనివారం కొలువుదీరనున్నాడు. జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను సిద్ధం చేశారు. వినాయక చవితి నవరాత్రి వేడుకలను తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో యువత, భక్తులు మండపాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సూపర్‌ బజార్‌, రామవరం, కూలీలైన్‌, రామాటాకీస్‌, హనుమాన్‌బస్తీ, రైటర్‌బస్తీ, చిన్న బజార్‌, పెద్దబజార్‌, పాత కొత్తగూడెం, రుద్రంపూర్‌, గౌతంపూర్‌, పోస్టాఫీస్‌ సెంటర్‌ పాలకేంద్రం, విద్యానగర్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో వీధివీధినా గణేష్‌ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాలు, ఇళ్లు, మండపాల్లో వినాయకుడిని పూజించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లు సందడిగా మారాయి. కాగా ప్రతి మండపంలో నిర్వాహకులు ప్రశాంతంగా పూజలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సౌండ్‌ సిస్టంను రాత్రి 10 లోపు మాత్రమే వినియోగించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పోలీసులు సూచిస్తున్నారు.

21 రకాల పత్రాలతో పూజలు..

వినాయకుడికి 21 రకాల పత్రాలతో భక్తులు పూజలు చేశారు. మాచీపత్రం, బృహతీపత్రం (వాకుడాకు, నేల మూలిక), బిల్వ పత్రం (మారేడు), దూర్వాయుగ్మం (గరిక), దత్తూర పత్రం (ఉమ్మెత్త), బదరి పత్రం (రేగు ఆకు), తులసీ పత్రం (తులసీ), అపామార్గ పత్రం (ఉత్తరేణి పత్రం), చూతపత్రం (మామిడి పత్రం), కరవీరపత్రం (గన్నేరు పత్రాలు), విష్ణుకాంతం (హరి పత్రం), దాడిమీపత్రం (దానిమ్మ పత్రం), దేవాదారుపత్రం , మరువక పత్రం(మరువము) , సింధు వారపత్రం (వావిలాకు), జాజిపత్రం, గండకీపత్రం(కామంచి, అడవి మల్లె), శమీపత్రం(జమ్మి పత్రం), అశ్వాత్థపత్రం (రావి ఆకు), అర్జున పత్రం(మద్ది ఆకు), అర్క పత్రం(జిల్లేడు పత్రం)లతో వినాయకుడిని పూజిస్తారు.

తొమ్మిది రోజులపాటు వేడుకలు

నేటి నుంచి తొమ్మిదిరోజులపాటు గణపతిని పూజించనున్నారు. రజిత కవచాలంకృత గణపతి, బాల గణపతి, నాట్య గణపతి, మూషిక గణపతి, కాణిపాకం గణపతి, విద్యా గణపతి, లక్ష్మీ గణపతి, బాల గణపతి, సిద్ధి గణపతి, శయన గణపతి, నిజరూప గణపతిగా వరుసగా తొమ్మిది రోజులపాటు వినాయకుడు పూజలందుకోనున్నాడు.



కొత్తగూడెం రామాటాకీస్‌ ఏరియాలో వినాయక మండపం సిద్ధం చేస్తున్న భక్తులు



మణుగూరు టౌన్‌ పట్టణంలో విక్రయిస్తున్న పూజా సామగ్రి

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. మత సామరస్యాన్ని పాటించాలి. ప్రతి వినాయక మండపానికి కమిటీ సభ్యులు బాధ్యత వహించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు. ప్రతి మండపానికి అనుమతులు తీసుకోవాలి. డీజే సౌండ్‌ సిస్టం వినియోగిస్తే సీజ్‌ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తాం.

–అబ్దుల్‌ రెహమాన్‌, కొత్తగూడెం డీఎస్పీ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు



న్యాయమూర్తి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం సభ్యులు

భద్రాచలంఅర్బన్‌: వయోవృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గెట్‌ టూ గెదర్‌ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులు న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ది మెయింటెనెన్స్‌ అండ్‌ వెల్ఫేర్‌ ఆఫ్‌ పేరెంట్స్‌, సీనియర్‌ సిటిజెన్స్‌ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయసహాయం కోసం మండల లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ న్యాయవాదులు పామరాజు తిరుమల రావు, నాగరాజు, రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, అధ్యక్షుడు భూషణ్‌రావు, కార్యదర్శి వెంకన్న, ట్రెజరర్‌ హనుమంత్‌రావు, ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌ భగీరథ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నిరసన తెలుపుతున్న కార్మికులు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలో రథంగుట్ట వద్ద మిషన్‌భగీరథ వాటర్‌ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌లో పని చేస్తున్న పోచంపాడు కంపెనీ కాంట్రాక్ట్‌ కార్మికులు శుక్రవారం ప్లాంటు ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఐదు నెలల పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాయం నాగరాజు, బొల్లు సతీష్‌, తుర్రం నాగేంద్రబాబు, పాల సుజాత, బొల్లోజు సతీష్‌, గుగులోత్‌ సంధ్య, జ్యోతి, నాగమణి, ఇర్పా లక్ష్మణ్‌, లక్ష్మణ్‌రావు, పొడుతూరి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్‌: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న జాయింట్‌ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని భద్రాచలం టౌన్‌ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కాగా ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జూలూరుపాడులో భారీగా.. ?

జూలూరుపాడు: కొందరు వ్యక్తులు వాహనంలో అక్రమంగా భారీ మొత్తంలో గంజాయిని తరలిస్తున్నట్లు తెలియడంతో గురువారం రాత్రి జూలూరుపాడు పోలీసులు వెంబడించి పట్టుకున్నట్లు సమాచారం. వాహనాన్ని పోలీస్‌ స్టేషన్‌కు తరలించి, ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 250 కిలోలు ఉండవచ్చని తెలిసింది. గంజాయితో మరో నలుగురికి సంబంధం ఉందనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నటు ప్రాథమిక సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

బడి మానేసిన పిల్లలకు కౌన్సెలింగ్‌



విద్యార్థులకు నోట్‌, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం

టేకులపల్లి: వివిధ పాఠశాలల్లో చదివి ఇప్పుడు పనులకు వెళ్తున్న ముగ్గురు బాలికలను బోడు జెడ్పీహెచ్‌ఎస్‌, టేకులపల్లి మండల నోడల్‌ ఆఫీసర్‌ అజ్మీరా జగన్నాయక్‌ తిరిగి బడిలో చేర్పించారు. టేకులపల్లి మండలం ఒడ్డుగూడెంకు చెందిన ఈసం రక్షణ, గలిగ శృతిహాసిని, చింత వర్షిణి ఈ ఏడాది స్కూళ్లకు వెళ్లడం లేదు. దీంతో జగన్‌, సిబ్బందితో కలిసి వెళ్లి వారి బాలికలు, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించి బోడు ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేర్పించారు. వీరికి శుక్రవారం నోట్‌ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందజేశారు.

• కిన్నెరసాని నీటి విడుదల

పాల్వంచరూరల్‌: కిన్నెరసాని జలాశయానికి ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. రిజర్వాయర్‌ పూర్తిస్థాయి నీటమట్టం 407 అడుగులు కాగా శుక్రవారం 405.30 అడుగులుగా నమోదైంది. రిజర్వాయర్‌లోకి 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్ట్‌ రెండు గేట్లను ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్‌ పర్యవేక్షక ఇంజనీరు తెలిపారు.

• ఐదుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు: జూలూరుపాడు శివారులో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. రూ. 6,700 నగదు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాణా ప్రతాప్‌ తెలిపారు.

మావోయిస్టుల మృతదేహాలు అప్పగింత

పంచనామా నిర్వహించి అప్పగించిన డీఎస్పీ, సీఐలు



మావోయిస్టు రాము మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న కుటుంబ సభ్యులు

మణుగూరు టౌన్‌: మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు వారి కుటుంబీకులకు అప్పగించారు. కరకగూడెం మండలం దోనాల గుట్టపై గురువారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. మృతదేహాలకు గురువారం రాత్రి మణుగూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు. రాత్రి 2 గంటలకు లచ్చన్న అలియాస్‌ కుంజా వీరన్న, పూనెం లక్కే అలియాస్‌ తులసి(లచ్చన్న భార్య) మృతదేహాలను పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రత్యేక అంబులెన్స్‌ ఏర్పాటు చేసి వారి స్వగ్రామం ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం సుక్మా జిల్లా గొల్లపల్లి మండలం రాయిగూడకు తరలించారు. శుక్రవారం ఉదయం కొవ్వాసి రాము అలియాస్‌ కొర్సా జోగయ్య మృతదేహాన్ని తండ్రి ఐతయ్య, సోదరుడు సురేష్‌లకు అప్పగించారు. ప్రత్యేక అంబులెన్స్‌ ద్వారా స్వగ్రామమైన ఎటపాక మండలం వీసాపురం పంచాయతీ, సంఘింపాడు గ్రామానికి పంపించారు. సోడె భద్దె అలియాస్‌ దుర్గేష్‌ మృతదేహాన్ని అతని సోదరుడు జోగ, అల్లుడు సింగయ్యకు అప్పగించారు. శుక్రవారం రాత్రి వెన్నెల మృతదేహాన్ని ఆమె సోదరుడు కుంజా భీమాకు, పొడియం కోసయ్య అలియాస్‌ శశ్రు మృతదేహాన్ని అతని కుటుంబీకులకు అప్పగించారు. మృతదేహాలను స్వగ్రామం బీజాపూర్‌ జిల్లా కోమటిపల్లికి ప్రైవేటు వాహనాల్లో పంపించారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్‌ రెహమాన్‌, సీఐలు సోమ సతీష్‌కుమార్‌, వెంకటేశ్వర్లు పంచనామా నిర్వహించారు.

బైక్‌ను ఢీ కొట్టిన టిప్పర్‌ : ఒకరు మృతి

బూర్గంపాడు: సారపాకకు సమీపంలోని శ్రీరాంపురం మూలమలుపు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిలిస్ట్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ను అతివేగంగా టిప్పర్‌ ఢీ కొట్టడంతో మోటార్‌సైకిలిస్ట్‌ తలభాగం ఛిద్రమైంది. ఎస్‌ఐ రాజేష్‌ ప్రమాద స్థలిని సందర్శించి, బైక్‌ నెంబర్‌, మృతుని జేబులో ఉన్న కార్డుల ఆధారంగా మృతుడు దుమ్ముగూడెం మండల పరిషత్‌ కార్యాలయం అటెండర్‌ పెనకట్ల రాజారమేష్‌(45)గా గుర్తించారు. భద్రాచలంలో నివాసముంటున్న రాజారమేష్‌ వ్యక్తిగత పనుల నిమిత్తం పాల్వంచకు వెళ్లివస్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య సునీత, కుమార్తె విశ్వతేజిని ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ పైనుంచి పడి వృద్ధురాలు..

చంద్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామానికి చెందిన బత్తుల ఆదెమ్మ(75) శుక్రవారం ద్విచక్ర వాహనంపై నుంచి పడి మృతి చెందింది. వృద్ధురాలు తన కుమారుడు కృష్ణయ్యతో కలిసి బైక్‌పై ఆస్పత్రికి వెళ్తొస్తుండగా..చంద్రుగొండ గ్రామశివారులో కుక్క అడ్డు రావడంతో కృష్ణయ్య ఒక్కసారిగా బైక్‌ బ్రేక్‌ వేశాడు. దీంతో ఆదెమ్మ వాహనంపై నుంచి కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి సోదరుడు అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ స్వప్న తెలిపారు.

మద్యం మత్తులో డ్రైయినేజీలో పడి..

పాల్వంచ: మద్యం మత్తులో డ్రైయినేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పాలకోయ తండాకు చెందిన బోగనేని రామారావు (40) బస్టాండ్‌ సమీపంలోని ఓ కర్రీ పాయింట్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు జారి డ్రైయినేజీ కాలువలో పడిపోయాడు. డ్రైయినేజీ నీళ్లలో ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్‌ తెలిపారు.

యెహోవా భక్తుల మరణము ఆయన దృష్టికి విలువ గలది కీర్తనలు 116:15
కీ॥శే॥ జీనుగు జాస్లిన్‌ మేరీ
Retired Head Mistress
జననం : 28-05-1951
మరణం : 28-08-2024
కార్యస్థలం & తేది : 07-09-2024, శనివారం,
ఉ॥ 11.00 గం॥లకు సి.ఎస్‌.ఐ వెస్లీ చర్చ్‌, ముషీరాబాద్‌,
హైదరాబాద్‌ నందు జ్ఞాపకార్థకూడిక జరుపబడును.
సెల్ : 7702371777, 9000738887

సాక్షి క్లాసిఫైడ్స్‌
Wanted
■ హరేకృష్ణ హోం కేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్‌: 9640258899, 9640468899 [H-796272]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

శ్రీరామ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్
పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

వినాయక చవితి శుభాకాంక్షలు
లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజ్ & హైస్కూల్
మెడికల్ కాలనీ, తాతగుడి సెంటర్, భద్రాచలం, ఫోన్: 08743-231510

శ్రీ కాంతి హాస్పిటల్స్
22-1-1/A/3, శ్రీనివాస కాలనీ, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, పాల్వంచ.
Dr. T. రమేష్ కుమార్, MBBS., DNB, Anesthesia, Consultant General & Critical Care Specialist
Dr. B.V.N. చైతన్య, MDS., Pedodontist, చైర్‌పర్సన్, పిల్లల, పెద్దల దంత వైద్య నిపుణురాలు
Cell : 75572 34567

హై కేర్ హాస్పిటల్
RIGHT CARE - RIGHT HERE
స్టేషన్ రోడ్, మధిర. సెల్ : 9704386585
మేనేజ్‌మెంట్: జంగా ప్రవీణ్‌రెడ్డి
సెల్ : 70329 65975

శ్రీరక్షా హాస్పిటల్‌ వారి రిహాబ్‌ బుద్ధ
ఇంటి వాతావరణంలోనే హాస్పిటల్‌ వైద్యసేవలు
రిహాబ్‌ బుద్ధ ముఖ్య ఉద్దేశం: క్రానికల్‌ డిసీజెస్‌, హైపర్‌ టెన్షన్‌, డయాబెటీస్‌, కిడ్నీ డిజీజెస్‌, లంగ్స్‌, పోస్ట్‌ కోవిడ్‌, హార్ట్‌ సర్జరీ, నీ రిప్లేస్మెంట్‌, స్పైయిన్‌, బ్రెయిన్‌ ఇలా మేజర్‌ సర్జరీస్‌ అయినవాళ్ళు హాస్పిటల్లో ఎక్కువ రోజులు ఉండలేని పరిస్థితి, పైగా వీరికి మెడికల్‌ కేర్‌, ఫుడ్‌ కేర్‌, నిరంతరం మనిషి ప్రక్కన ఉండి చూసుకోవాల్సి వస్తుంది. చాలా కుటుంబాలలో ఇది సాధ్యపడే విషయం కాదు. ఇలాంటి మంచానికే పరిమితమయ్యే పేషెంట్లను ప్రక్కన ఎవరు అవసరం లేకుండా కుటుంబ సభ్యులు లాగా మేమే చూసుకుంటాము.
రిహాబ్‌ బుద్ధ ఎక్కడ : ఖమ్మం నగర నడిబొడ్డున. జెడ్పీ సెంటర్‌, జమ్మిబండ దగ్గర, శ్రీరక్ష హాస్పిటల్‌ డా. జి.వి. గారి ఆధ్వర్యంలో 32 బెడ్స్‌తో స్థాపించబడినది.
రిహాబ్‌ బుద్ధాలో లభించు సేవలు: మహానగరాలకే పరిమితమైన నూతన హాస్పిటల్‌ విధానం ఇప్పుడు మన ఖమ్మంలో ప్రారంభించబడినది. ఇక్కడ పక్షవాతం వచ్చినవాళ్ళు, శారీరక ఇబ్బందులతో బాధపడుతున్న వారు, మేజర్‌ ఆపరేషన్లు మరియు యాక్సిడెంట్‌ నుండి రికవరీ, క్యాన్సర్‌ మరియు నివారణ లేని వ్యాధులతో బాధపడుతున్నవారికోసం... యోగ, మెడిటేషన్‌, శారీరక, మానసిక సంతోషంతో సేవలందించబడును. మెడికల్‌ ఎమర్జెన్సీ ఉన్న వారికోసం మన శ్రీరక్ష ఎమర్జెన్సీ హాస్పిటల్‌ మరియు ఇంకా మేజర్‌ ఎమర్జెన్సీ హాస్పిటల్స్‌కు అందుబాటులో కలవు. మరిన్ని వివరాలకు 9010810400.
Rehab BUDDHA
Dr. Venkateswarlu, MBBS, MD, DA, Emergency Medicine
9010810400, 9010810422

వినాయక చవితి శుభాకాంక్షలు
మట్టి వినాయకున్ని పూజించండి ! పర్యావరణాన్ని కాపాడండి !!
పర్యావరణ పరిరక్షణ సంఘం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

RADHIKA CONCEPT SCHOOL (Prime Campus)
RAJEEVGANDHI NAGAR, MANUGURU, BHADRADRI KOTHAGUDEM (DIST.)
Contact : 888 666 5185, 888 603 5959.

ankura hospital
HAPPY Ganesh Chaturthi
Ankura Hospital for Women & Children
Opposite Gorilla Park, Sequel Road, Khammam, Telangana - 507002.